# నిధి చాలా సుఖమా?

-స్వరూప్ సిన్హా

'ఆమె నిజంగా ఆమేనా...!!' పరిశీలనగా అటువైపు చూశాడు అజయ్. అంతలో అకస్మాత్తుగా కరెంటు పోవడంతో నిట్టూర్చి ఆడిటోరియం లోపలి ఉక్కకు తట్టుకోలేక కారిడార్‌లోకొచ్చి సిగరెట్టు వెలిగించాడు.

'ఎన్నేళ్ళనాటి మాట...! పొరపడ్డానేమో...' అనుకుంటూండగా కరెంటు వచ్చి దేదీప్యమానమైన కాంతితో హాలంతా నిండిపోయింది. ఒక్కసారిగా హాలంతా 'హమ్మయ్య' అంటూ సంతోషపు నిట్టూర్పులు వినిపించాయి.

స్టేజీమీద అనౌన్స్ చేస్తున్నారు.

'త్యాగరా జోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శాస్త్రీయ సంగీత కార్యక్రమంలో ప్రేక్షకులకో సర్‌ప్రైజ్ ఐటమ్ అందివ్వబోతున్నాం. జాతీయస్థాయి సంగీత పోటీల్లో రాష్ట్రపతి నుంచి బంగారుపతకాన్ని అందుకున్న కుమారి విపంచి గానమాధుర్యాన్ని మీరిప్పుడు చవిచూడ బోతున్నారు.'

ఉలిక్కిపడ్డాడు అజయ్.

'విపంచి... విపంచి... విపంచి...!"


'నీ జ్ఞాపకాల పూదోటల్లో
కనురెప్పల వింజామరల నీడల్లో
తూర్పు పడమరలంత
విశాలమైన బాహువుల మధ్య
నీ కనుపాపనై, పసిపాపనై,
అంబరమంత సంబరాన్నై,
నీ హృదయ విపంచినై...
నను సేదదీరనీ...!'

ఆమే. సందేహం లేదు. తన హృదయ విపంచి! అంతలో అతని వెన్నుపై కొరడా ఝుళిపించి నట్టయ్యింది.

"జీవితం చాలా చిన్నది అజేయా! నీ లెక్కప్రకారం అది చాలా ప్రాక్టికల్‌గా ఉండాలి కాబోలు! కానీ ఈ అనంతమైన ప్రకృతిని చూడు. గాలికీ, నీటికీ, ఏటికీ, కోయిల పాటకీ... చెట్టుకి పుట్టకీ.... పిట్టల సంబరానికీ ఓహ్... ఇలా చెప్పుకుంటూపోతే ఈ విశ్వంలోని ప్రతి అణువుకీ... ప్రాక్టికల్ థింకింగ్ ఏముంది చెప్పు..?" చెమర్చిన కళ్ళతో.... ఆశగా, ఆర్తిగా తన కళ్ళలోకి చూస్తూ అభ్యర్థనగా అడుగుతున్నట్లు విపంచి కనిపించింది. స్టేజీ మీద విపంచి అభోగి రాగాలాపన మొద లయ్యింది.

అదే కంఠం. అదే గాన గాంధర్వం! తన ముగ్ధ మనోహర స్వరఝురిలో అమృత వర్షాన్ని కురిపించి, ప్రేక్షకుణ్ణి సేదదీర్చి, ప్రాణంపోసే ఉదాత్తత...! సంగీత సాహిత్యాల్లో ఆమె తాదాత్మకత...! త్యాగరాయ కీర్తన అందుకుందామె-

"మనసు నిల్ప శక్తిలేకపోతే, మధుర ఘంటవిరుల పూజేమి సేయునూ?" అతను తప్ప ప్రేక్షకులంతా అమ్మ పాడుతున్న జోలకు చెవులప్ప



గించి సేదదీరుతున్న పసిపాపల్లా ఆమె గానంలో లీనమయ్యారు.

తొలకరిలో తడుస్తోన్న మల్లెమొగ్గ ల్లాంటి ఆరమోడ్పు కన్నులతో లయబద్ధంగా తలలూపుతున్నారు.

తాను అహాన్ని ప్రేమించాడు. విపంచిని కాదు. అలాగే నిస్త్రాణగా సీటుకి జేరగిలబడి కూచున్నాడు.

స్పీకర్లలోంచి వినిపిస్తున్న విపంచి గొంతు గతంలోని జీవన సంగీతాన్ని సుతారంగా తట్టి లేపుతూంది.

చెవిదగ్గర జంటస్వరాల్ని పలుకుతూంది. ఆమె మనసు గొంతువిప్పి తన మనసుకు రాగాలాపన నేర్పుతూంది.

అవును! విపంచితో తన గతం స్వరబద్ధం చేసిన వీణ! మరి వర్తమానం? అపస్వరాల, అపహాస్యాల శిథిలవీణ!



పదేళ్ళ క్రితం...!

"నువ్వు సంగీతం మొదలెట్టి అయిదారేళ్ళు కావస్తూంది. పరీక్షకు కట్టవెందుకని? త్వరగా డిప్లమా సంపాదిస్తే ఉద్యోగం వస్తుంది. రెండు చేతులా ఆర్జించవచ్చు..."

అజయ్ అప్పటికి రెండేళ్ళుగా గవర్నమెంటు కాలేజీలో వీణ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. నవ్వేసి ఊరుకుంది విపంచి.

ఆమె కళ్ళు మూసుకుని గురువుగారు కొత్తగా నేర్పిన రాగాన్ని ఆలపిస్తూంది. తరువాత నెమ్మదిగా కళ్ళు విప్పింది ఓహ్...! సంగీతం పాడేటప్పుడు ఆ కళ్ళలో ఎంత కాంతి! కొత్త రాగాల్ని, స్వరకల్పనల్నీ సాధన చేసేకొద్దీ ఆమె మోము ప్రఫుల్లమవుతుంది. సంగీత సరస్వతి ఒడిలో మైమరిచి సేదదీరే పసిపాపలా కళ్ళు ఆరమోడ్పులవుతాయి.

పాడేటప్పుడామె మోములో ఆ కాంతి ఏమిటో అజయ్‌కు ఎంత ఆలోచించినా అర్థమయ్యేది కాదు.

"నేను నీ అంత త్వరగా నేర్చుకోలేను. స్వరాల పందిట్లో ఇంకా తప్పటడుగులు వేస్తున్న పసిపాపను నేను..." అనేది ఆమె.

అప్పటికి వారిద్దరి మధ్యా అనురాగం అంకురించి ఏడాదిపైనే అయ్యింది. వారి తొలి పరిచయం సంగీత ప్రాంగణంలోనే జరిగింది. వారి పెళ్ళికి పెద్దల, గురువుల ఆశీస్సులు కూడా లభించాయి.

అయితే విపంచి ఎప్పుడూ తన సంగీత ప్రపంచంలోనే ఉండేది. తన సంగీతమేమిటో, తనేమిటో తప్ప ఈ ప్రాపంచిక విషయాలేవీ పట్టనట్టే ప్రవర్తించేది.

అజయ్ కోపం ఓసారి తారాస్థాయి నందుకుని అడిగాడు.

"నువ్వసలు నన్ను ప్రేమిస్తున్నావా లేదా?" అని ఆమె కళ్ళల్లో సర్రున నీళ్ళు తిరిగాయి.

"అలా మూగ గొడ్డులా గుడ్లప్పగించి చూడ్డం కాదు. నాకు సమాధానం కావాలి." రెట్టించాడు.

ఆమె చెప్పింది చాలా నెమ్మదిగా, గద్గద స్వరంతో...

"పసిపాప తల్లిలేకుండా బ్రతకలేదు. తల్లడిల్లిపోతుంది. అంతమాత్రాన తల్లిపట్ల తనకుగల

ప్రేమను అందంగా మాటల్లో పొదిగి చెప్పగలదా..? తల్లిని చూడగానే సంతోషంగా ఓ బోసినవ్వు నవ్వుతుందే తప్ప...!"

అజయ్‌కు ఆమె మూగప్రేమేమిటో అర్థమయ్యేది కాదు.

"మాటరాని పాపాయిల్ని ఉదాహరణగా తీసుకుంటున్నావ్! సంగీత త్రయపు సాహిత్యాన్ని ఔపోసన పట్టామన్న సంగతి మర్చిపోతున్నావు..." వెటకారంగా అన్నాడు.

"పిచ్చి అజేయా...! నా ప్రేమను అర్థం చేసుకుంది ఇంతేనా? నా సంగీత సాహిత్యాలన్నీ నీకే అంకితమన్న విషయాన్ని మర్చిపోతున్నావు. గురువు గారితో కల్సి కచేరీలు చేసేటప్పుడు, కళ్ళు మూసుకుని నేను ముందుగా తలచుకునేది నీ రూపాన్నే... ఇంకా చెప్పాలంటే నువ్వే సంగీతం! నేను మమేకమయ్యేదీ నీలోనే...!"

అలా వారి ప్రేమ ప్రవర్థమానమై మరో రెండు నెలల్లో వివాహంతో స్థిరపడుతుందనగా అజయ్‌కు ఓ సినిమాలో సంగీత దర్శకుడిగా పని చేసే అవకాశం వచ్చింది.

అయితే ఆ వార్త విన్న విపంచి ఏమాత్రం సంతోషించక పోగా నిర్లిప్తంగా ఉండిపోయింది. ఆమె మౌనాన్ని అతను మరోలా అర్థం చేసుకున్నాడు.

"నేను సినిమాల్లో పేరు తెచ్చుకోవడం నీకిష్టం లేదు కదూ.... అసూయగా ఫీలవుతున్నావనుకుంటా..." వ్యంగ్యం ధ్వనించింది అతని కంఠంలో.

"ఛ... అవేం మాటలు! నేను బాధపడుతున్నది అందుక్కాదు." అంది నెమ్మదిగా.

"అయినా ఇంత శుభవార్త చెప్పాక బాధపడ్డ మొదటి వ్యక్తిని నిన్నే చూస్తున్నాను..." అన్నాడతను కోపంగా.

"నిన్నొదిలిపెట్టి నేనుండలేను అజేయా. నువ్వు మద్రాసెళ్ళిపోతే..." ఆపైన మాట్లాడలేకపోయింది. దుఃఖంతో ఆమె గొంతు బొంగురుపోయింది.

"పిచ్చీ... నిన్నొదిలి నేనెందుకు వెళ్తాను? నేను ముందుగా వెళ్ళి స్థిరపడ్డాక నిన్నూ మన వాళ్ళనీ తీసుకెళ్తాను. నువ్వు కూడా సినీరంగంలోకి ప్రవేశించాల్సిందే. నేన్నిన్నొదిలిపెట్టను..." నవ్వాడతను.

ఆమె వినలేనట్టు చెవులు రెండూ మూసుకుంది.

"అదేమిటి?" ఆశ్చర్యపోయాడతను.

"దయచేసి నన్ను రమ్మని మాత్రం బలవంత పెట్టకు. నేను సంగీతాన్ని నేర్చుకుంటున్నది సినిమాల్లో స్థిరపడ్డానిక్కాదు." దృఢంగా పలికిందామె.

"మరి?" రెట్టించాడతను.

"సంగీతం సరస్వతీ దేవి మనకిచ్చిన వరం. అది ఆమెకే అంకితం చేయాలి. భగవంతునిలో తల్లీనమయ్యే మోక్షసాధనం, జన్మ తరింపచేసు కోవడానికి మనమెన్నుకున్న మార్గం సంగీతం. దాన్ని తుచ్ఛమైన ధన సంపాదనకు, పేరు ప్రతిష్టలకూ పణంగా పెట్టకూడదు."



కె.బి.భార్గవాచారి, హరివరం పోస్ట్, కోవెలకుంట్ల తాలూకా, కర్నూలు జిల్లా.

చప్పట్లు కొట్టాడు అజయ్.

"శెభాష్... చివరికి నాకే పాఠాలు చెప్పేంతగా ఎదిగిపోయావన్న మాట. అసలు నాలుగు రాళ్ళు సంపాదించి పెట్టలేని సంగీతమెందుకు? అడుక్కు తినడానికా...?" కోపంగా అడిగాడతను.

"సరిగ్గా చెప్పావు అజేయా. ఉంఛ వృత్తినెన్నుకున్న త్యాగయ్య తాను తలచుకుంటే దాన్నొదిలి పెట్టి కృతులన్నీ రాజుకంకితమిచ్చి ధనవంతుడయ్యేవాడు. కానీ ఆ మహానుభావుడలా చెయ్యలేదే! నిధి కంటే రాముని సన్నిధి సేవే సుఖమనుకున్నాడు." కళ్ళు మూసుకుని చెప్పింది తన్మయత్వంతో.

"చాల్చాల్లే ఆపు...! మెటీరియలిజమ్ లేని జీవితం జీవితమే కాదు. మనిషన్నాక కాస్త ప్రాక్టికల్ థింకింగ్ ఉండాలి. నువ్వు నాతో వచ్చినా రాకున్నా నేను మాత్రం సినీ రంగంలో స్థిరపడడం ఖాయం! సంవత్సరం తిరక్కుండానే అటు డబ్బూ ఇటు పేరూ సంపాయించి వెలిగిపోవడమూ ఖాయం" చెప్పాడు గర్వంగా.

"జీవితంలో మరీ అంత మెటీరియలిజమ్ ఉండాలా అజేయా...?" కళ్ళనీళ్ళతో ఎంతో ప్రాధేయపడింది.

తనను మద్రాసు వెళ్ళవద్దనీ ఈ రోజుల్లో సినీరంగంలో పేరు ప్రఖ్యాతులు కేవలం క్షణికమేననీ ఎంతో నచ్చచెప్పింది. కొన్నేళ్ళ పోయాక అసలు తనను పట్టించుకునే వారే ఉండరంది. డబ్బూ, పేరూ శాశ్వతం కాదు. కేవలం సంగీతం మాత్రమే శాశ్వతమంది.

ఊహూ...! తను విన్లేదు. మద్రాసు వెళ్ళిపోయాడు. కొత్తలో మంచి గిరాకీ ఏర్పడి నాలుగయిదేళ్ళలో బాగా డబ్బు సంపాదించినా ఆ తరువాత తనకున్న డిమాండు పడిపోయింది.

ఎవరో కొత్త సంగీత దర్శకుడు కొత్త ప్రయోగాలు చేస్తున్నాడని నిర్మాతలంతా అటు పరిగెత్తారు.

తన పరిస్థితి గమ్యం లేని ఎడారిలో అర్థంలేని పరుగుపందెంలా అనిపించింది.

అడపాదడపా ఒకటీ అరా సినిమాలకి ఛాన్సు తగిలినా నిర్మాతలు తను కట్టిన బాణీలు విని

ేసుక్కునేవారు.

"ఈ స్లో ట్యూన్స్ ఎవడిక్కావాలండీ... కొత్తగా మేం వాడుతున్న కంప్యూటరైజ్డ్ మ్యూజిక్ ఉండగా ఈ వీణ, వయొలీన్ లాటి వాయిద్యాలేమిటి? మేం మీకు కొన్ని విదేశీ క్యాసెట్లిస్తాము. అవివిని అలా కంపోజ్ చెయ్యండి చాలు. పాటలక్కర్లేదు. అక్కడక్కడా అశ్లీలపు మాటలుంటే చాలు. అయినా మాటల్తోనే తప్ప మ్యూజిక్‌తో అశ్లీలాన్ని పలికించడం చేతగాని మీరేం సంగీత దర్శకులండీ బాబూ..." అనేవారు.

చెవులు మూసుకుని వచ్చేసేవాడు రికార్డింగ్ థియేటర్ నుంచి. వాళ్ళ తలలు పగలగొట్టాలనిపించేంత కోపం వచ్చేది.

ఇంకా గుండె బద్దలయ్యే విషయమేమిటంటే ఒకే నిర్మాత నలుగురైదుగురు సంగీత దర్శకులను ఊరూ పేరూలేని ఓ సినిమాకి కేకల్లాంటి పాటలు కంపోజ్ చెయ్యమంటాడు.

ఆ తరువాత ఎవరి 'పాటలు' తన అభిరుచికి దగ్గరగా ఉంటే అతన్ని ఫైనలైజ్ చేసి మిగతా నలుగుర్నీ రిజెక్ట్ చేస్తాడు.

దీంతో ఆ మిగతావారికున్న పేరు కాస్తా తుడిచిపెట్టుకుపోతుంది. మరే నిర్మాతా అవకాశాలివ్వడు. అలా, అజయ్ అపజయాల్ని ఎదుర్కోవడం మొదలయ్యింది.

క్రమంగా చెడు అలవాట్లకూ బానిసైపోయాడు. అయిదేళ్ళలో సమకూర్చుకున్న ఆస్తి అంతకంటే త్వరగానే హరించుకుపోయింది.

చివరికి సినీరంగం బహుకరించిన క్షయ వ్యాధితో, తిండికి కరువైన దీనస్థితిలో ఎక్కడెక్కడో తిరిగి తన ఊరు చేరుకున్నాడు.

కరతాళధ్వనుల మధ్యన అనౌన్సర్ కంఠం వినిపించి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు అజయ్ హాలు నెమ్మదిగా ఖాళీ అవుతూంది.

"అమ్మగారు తమర్ని తీసుకురమ్మన్నారు. కారు దగ్గిరున్నారు." చెప్పాడో అపరిచిత వ్యక్తి.

లేచి మంత్ర ముగ్ధుడిలా అతని వెంట నడిచాడు. అల్లంత దూరాన్నుంచే వినమ్రంగా నమస్కరించింది విపంచి. ఆశ్చర్యంగా అడిగాడు...

"నన్ను... నన్ను గుర్తుపట్టావా విపంచీ... ఇన్నేళ్ళ తరువాత"

"నేర్చుకున్న రాగాల్ని గుర్తుపట్టడానికి నాకున్న సంగీతానుభవం చాలనుకుంటాను..." అందామె.

ఇద్దరూ కూచున్నాక కారు కదిలింది. అతనాలోచిస్తున్నాడు. ఆమె ఉద్దేశం ఏమై ఉంటుంది? తనను ద్వేషిస్తుందా? లేక ఇంకా ప్రేమిస్తుందా? తననెందుకు పిలిపించినట్టు?

"నేను నెలక్రితం నీకో ఉత్తరం రాశాను విపంచీ. కానీ నీనుంచి సమాధానం లేదు."

"అంతకు ముందు నేన్నీకు చాలా ఉత్తరాలు రాశాను. బహుశా సినీ సంగీత జగత్తులో బిజీగా ఉండి సమాధానం వ్రాయడం కుదరలేదనుకుంటాను."

గుండెలో బాకులా దిగిందామె సమాధానం.

"నన్ను క్షమించు విపంచీ..." మంద్ర స్వరంతో అన్నాడతను. "విపంచీ... ప్లీజ్, నన్నర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. నువ్వే గెలిచావని ఒప్పుకుంటున్నాను. నీకిష్టమైతే మనిద్దరం పెళ్ళి..."

"స్టాపిట్ అజేయా... స్టాపిట్... ప్లీజ్ స్టాపిట్!" ఆమె అంత తీవ్రంగా మాట్లాడటం అతనెప్పుడూ చూడలేదు.

ఆమె కళ్ళు రక్తాన్ని వర్షిస్తున్నాయా అనిపించిందతనికి...

"నువ్వు కాదని వెళ్ళిపోయినా నేను బాధపడింది కొంతకాలమే. పీటలవరకూ వచ్చిన పెళ్ళి ఆగిపోయినందుకు గుండె ఆగి చనిపోయిన నాన్నను చూసి ఏడ్చింది కొంతకాలమే.కానీ... నువ్వు... నువ్వు... సంగీత సరస్వతికే ద్రోహం చేశావు. నాకు కాదు! పాలు తాగిన రొమ్మును గుద్దినట్టు స్వరాక్షరాల్ని నేర్పిన ఆ తల్లి గొంతునే నులిమేశావు. ఇంకా చెప్పాలంటే డబ్బుకోసం తల్లినేచంపుకున్నావు. అయితే నువ్వలా వెళ్ళిపోవడమే మంచిదయ్యింది. నీ మీద ప్రేమ అనే భ్రమ తొలగిపోయిన మరునిముషం నుంచీ నేను నా సర్వశక్తుల్నీ సంగీతసరస్వతికీ ధారపోశాను. ఇప్పుడిక భ్రమలకూ, ప్రలోభాలకూ లొంగే స్థాయిని దాటిపోయాను. నేను సంగీతంలోనే జీవించాలి. నా జీవితం ఆ చల్లని తల్లి ఒడిలోనే చరమగీతాన్ని పాడాలి. దయచేసి ఇంకెప్పుడూ మన మధ్యన ప్రేమ పెళ్ళిలాటి ప్రస్తావన తేవద్దు." కళ్ళు రక్తాశ్రువుల్ని వర్షిస్తుండగా నమస్కరించి చెప్పింది.

కారు బంగళా ముందాగింది. కళ్ళు తుడుచుకుని చెప్పింది.

"నాతో రా అజేయా...!" నెమ్మదిగా దిగి ఆమె ననుసరించాడు.

ముందు హాల్లో పదిమంది పిల్లలు సుమారు పదిపన్నెండేళ్ళవారు సంగీత సాధన చేస్తున్నారు.

"వీళ్ళంతా నాకు దేముడిచ్చిన పిల్లలు, రేపటి విద్వాంసులు" చెప్పింది.

కళ్యాణి రాగాలాపన ముగించి వారిలో ముద్దుగా నాయకుడిలా కనిపిస్తున్న పిల్లవాడు కృతి నందుకున్నాడు భక్తి పారవశ్యంతో....

"నిధి చాలా సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా?"

అజయ్ కళ్ళు చెమర్చాయి అప్పుడర్థమయ్యిందతనికి. పాడేటప్పుడు విపంచి మోమున వెలిగే కాంతికి కారణం- మనసులోని భక్తి, నిష్కల్మషం, ప్రశాంతత అని. ఇక అక్కడుండలేక వెనుదిరిగాడు.

గేటు దాటుతుండగా తన చేతినెవరో పట్టిలాగినట్టయి చూశాడు. ఆ ముద్దులు మూటగట్టే పిల్లవాడే!

"తమరిపేరు అజయ్ కదూ? తమరు గొప్ప సంగీత విద్వాంసులట. అమ్మ ఎప్పుడూ మీ గురించే చెవుతూంటుంది. మాకు వీణ నేర్పడానికొస్తారని చెప్పింది. రండి మాస్టారూ!"

చటుక్కున వంగి పాదాభివందనం చేశాడు పిల్లవాడు. తరువాత చేతులు జోడించి నిలుచున్నాడు.

అతని ప్రశ్నార్థకపు చూపులకు విపంచి సమాధానం- "సరస్వతీదేవి మందిరంలో సేవ చేయాలన్నా, సేద దీరాలన్నా తిరస్కరించలేను. నాకీ పిల్లలంతో నువ్వూ అంతే అజేయా! మనమంతా ఆ తల్లి ముద్దు బిడ్డలుగానే జీవితాన్ని కొనసాగిద్దాం. జీవితాల్ని సంగీతానికే అంకితం చేద్దాం. పద లోపలికెళదాం..."

అమ్మ స్వరాన్ని వింటూ మైమరచిపోయే పసివాడిలా విపంచిని అనుసరించాడు అజయ్.

★

స్వరూప్ సిన్హా,
లెక్చరర్,
45-85-ఏ, నరసింహారెడ్డినగర్,
కర్నూలు - 518 004.